క్లుప్తంగా

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

కనిగిరిరూరల్: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ యువీ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక పాతూరు ఎస్సీ కాలనీ మండల ప్రాథమిక పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కేసనపల్లి గ్లోరి ప్రతిష్ఠిత నవోదయ పరీక్షల్లో ప్రతిభ చాటి, ఆరో తరగతి ప్రవేశానికి అర్హత సాధించిందనందుకు పాఠశాలలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ఎం మాలకొండయ్య, ఎస్ఎంసీ చైర్మన్ గడ్డం ప్రియాంక, ఉపాధ్యాయులు నవోదయ ఫలితాల్లో ప్రతిభ చాటిన కేటీసీ స్టడీ సర్కిల్ విద్యార్థులను అభినందించారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి


పొన్నలూరులో ఈ-చలానా విధిస్తున్న ఎస్సై

పొన్నలూరు: ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై అనూక్ అన్నారు. పొన్నలూరులో గురువారం రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి లైసెన్స్, హెల్మెట్ లేని వారికి ఈ-చలాన ద్వారా జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ

పీసీపల్లి: మండల పరిధిలోని దివాకర్‌పురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాట్లను ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెదయిర్లపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 652లో సుమారు 475.57 ఎకరాల ఏడబ్ల్యూ భూమిని కేటాయించినట్లు తెలిపారు.

బాలుర హాస్టల్‌ను తరలించొద్దు

కనిగిరిరూరల్: ఎస్సీ బాలుర హాస్టల్‌ను వేరే చోటికి మార్చాలనే ప్రతి పాదనను విరమించుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.పాండురంగారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ, ఏఐఎస్ఎఫ్, వివిధ విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు మహేంద్రారెడ్డి, సీహెచ్ పవన్‌కుమార్, పండిటి మోహన్, దమ్ము వెంకటేష్, రమణారెడ్డి, మాలకొండయ్య, సీహెచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

కొండపి: పల్లె సీమలు పరిశుభ్రంగా ఉండాలని మంత్రి స్వామి అన్నారు. స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలోభాగంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 18 పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె సీమలను పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో 2 వేల జనాభా కలిగిన పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాకు 120 ట్రాక్టర్లను కేటాయించామన్నారు. పెద్ద పంచాయతీలకు డ్రైవింగ్ క్లీనర్లనుకూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది రోజు పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకట్‌నాయుడు, తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీఓ రామాంజనేయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందిస్తున్న సీఐ హజరత్తయ్య

టంగుటూరు: ముందు పోతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక టోల్‌ప్లాజా సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలుకు చెందిన పి. కుమార్ టంగుటూరు వైపు నుంచి ఒంగోలు వెళుతుండగా టోల్‌ప్లాజా దాటిన తరువాత టంగుటూరుకు చెందిన కల్లోపల్లి ఆంజనేయులు ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీకొట్టాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న సింగరాయకొండ సీఐ హజరత్తయ్య సంఘటన స్థలానికి చేరుకొని జాతీయ రహదారి అంబులెన్స్‌కి సమాచారం ఇచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం కుమార్‌ను ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రంజాన్ సతామీ షురూ..

- నియమ నిష్టలతో 'తాఖ్ రాత్' లు
- మసీదుల్లో ఎత్తేకాఫ్ దీక్షలు
- దానం బాధ్యత.. పేదల హక్కు జకాత్

కనిగిరిరూరల్:

ముస్లింల పవిత్ర రంజాన్ మాసం చివరి అంకానికి చేరుకుంది. రంజాన్ నెలలో 26 రోజుల కఠోర ఉపవాస దీక్షలు పూర్తయిన తర్వాత ఆఖరి మూడు రోజులకు ముందు వచ్చే షబ్- ఏ ఖదర్ రాత్రిని గురువారం ముస్లింలు అత్యంత నియమ నిష్టలతో, భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక నమాజులు, ఆరాధనలు, ప్రార్థనలు చేసి అల్లాహ్ అనుగ్రహం కోసం వేడుకున్నారు. షబ్ ఏ ఖదర్ తర్వాత ఆఖరి మూడు రోజుల ఉపవాస దీక్షలు (సతామీ) ప్రారంభమవుతాయి. రంజాన్ నెల ప్రారంభం నుంచి ఉపవాస దీక్షలు ఉండలేని వారు ఆఖరి మూడు రోజులు మాత్రం తప్పకుండా ఆచరిస్తారు.

దైనందిక జీవితంలోని అన్ని అంశాలను (సంసార బాంధవ్యాలు, వృత్తి పరమైన విషయాలను) పక్కన పెట్టి వీలైనన్నీ రోజులు (కనీసం 24గంటలు) అల్లాహ్ స్మరణలో, ఆధ్మాత్మిక చింతనతో గడపటమే ఎతికాఫ్. రంజాన్ మాసంలో ఏ ఊరిలోనైనా కనీసం ఒకరైనా అల్లాహ్ కోసం ఎతికాఫ్ ఆచరించాలి. లేకుంటే గ్రామంపై అల్లాహ్ కరుణ, కృపా, ప్రేమాభిమానం ఉండదు. ప్రళయాలు, విపత్తులు, పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అల్లాహ్ రక్షణ వారికి ఉండదని.. అల్లాహ్ స్పష్టం చేసినట్లు ఇమామ్‌లు తెలిపారు.

ఎతికాఫ్ ఇలా..

ఎతికాఫ్ (తపోనిష్ఠ)తో అల్లాహ్ ఆధ్యాత్మికతలో ఉన్నప్పుడు ఇతరులకు సమస్యగా ఉండకూడదని మసీదులోని ఓ మూలలో డేరా (పర్దా) ఏర్పరుచుకుంటారు. మల, మూత్ర విసర్జన (శుద్ధి, స్నానం) వజూ సమయాల్లోనే ×పర్దా×లో నుంచి బయటకువస్తారు. మిగతాసమయం అంతా దైవ స్మరణలో, ఖురాన్ చదువుతూ, సున్నత్ నమాజులు చదువుతూ దైవచింతనతో గడపుతారు. స్త్రీలు ఇంట్లోనే ఓ ప్రత్యేక గదిని (ఓ ప్రదేశంలో పర్దా) ఏర్పరుచుకుని ఎతికాఫ్ చేస్తారు. ఇఫ్తార్ సమయం కంటే ముందు 12 రకాతులు తహజూద్ (కనీసం రెండు రకాత్‌లు అయినా) నమాజ్ చదవాలి. ఈ సమయంలో 'సజ్దా' పద్ధతిలో దువా చేస్తే అల్లాహ్ అత్యంత సమీపం నుంచి వారి మొరను వింటారని ఖురాన్‌లో ఉంది. కుటుంబం యోగ క్షేమాలతో పాటు, బంధుమిత్రుల, సర్వమానావళీ సంక్షేమం కోరుతూ 'దువా' చేయడం ఉత్తమం. అలా చేస్తే అల్లాహ్ అనుగ్రహం లభిస్తోందని మౌలీలు, ముఫ్తీలు తెలిపారు. రంజాన్ మాసం చివరి పది రోజుల్లో కనీసం ఒక రోజైనా సున్నతే మౌఖిదా ఎతికాఫ్ పాటించాలి.


మసీదుల్లో ఇఫ్తార్‌లో ముస్లింలు

ఎత్తేకాఫ్ నియ్యత్‌ఇలా..

ఎతికాఫ్‌కి నియ్యత్ (నవాయితు అన్ బిస్మిల్లాహి, తవక్కల్‌తు వలైహీ దఖల్‌తూ వనవాయితూ బిసున్నతిల్ ఎతికాఫ్) చదివి ముస్లింలు ఎతికాఫ్‌ను ఆచరిస్తారు. అల్లాహ్ కోసం అన్నింటిని త్యజించి, దైవ సన్నిధికి వెళ్లి ఆధ్యాత్మికతలో విలీనమై.. కష్టాలు, బాధలు, సమస్యలు చెప్పుకుంటే అల్లాహ్ వారిపై అత్యంత కరుణ చూపి, వారి మొరను దగ్గరనుంచి అల్లాహ్ ఆలకిస్తారని ముస్లింల విశ్వాసం.

నిష్టతో పవిత్ర తాఖ్ రాత్‌లు

పవిత్ర రంజాన్ మాసంలో అత్యంత ముఖ్యమైనవిగా, అధిక పుణ్యాన్ని ఇచ్చే ×తాఖ్ రాత్ ׀లు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈమేరకు తాఖ్ రాత్‌లలో అధ్యాత్మిక వక్తలు, గురువులు అల్లాహ్ సందేశాన్ని తెలియచేస్తారు. ఈ నెల 23, 25,27,29 తేదీల్లో తాఖ్ రాత్‌లను ఆచరిస్తారు. దీని వల్ల వెయ్యి నెలలపాటు ఉపవాస దీక్షలు చేసినంత పుణ్యఫలం లభిస్తోందని మత పెద్దలు తెలిపారు.

పేదల హక్కు జకాత్

ఇస్లాంకు ఉన్న ఐదు మూల స్తంభాలలో జకాత్ ఒకటి. ఇది ఆరాధనలో రెండో విధి. ఇస్లాం పవిత్ర గ్రంథంలో జకాత్ గురించి ప్రస్తావన కనీసం 32 సార్లు ఉంది. దీని బట్టి జకాత్‌కు ఎంత ప్రాముఖ్యం ఉందో అర్థమవుతుంది. ఇది పేదల హక్కు. అవసరార్థులకు జకాత్ చెల్లించే సదాచారుల కోసం దేవుని వద్ద ప్రతిఫలం సిద్ధంగా ఉంటుంది. ప్రతి ముస్లిం తన సంపాదనలో రెండున్నర శాతం పేదలకివ్వాలన్నది జకాత్ ఉద్దేశం. నమాజ్ వలే ఇది కూడా తప్పనిసరి నియమం. ఇస్లాంను ఆచరించే వారు దీనిని విస్మరించరాదు.

> **దానం బాధ్యత:** రంజాన్ మాసంలో దాన ధర్మాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. పేదలకు సాయం చేయడం ముస్లింల బాధ్యత. పేదలు సంతోషంగా పండుగ జరుపుకోవడానికి ఈ విధానం ఎంతో దోహదపడుతుంది. రంజాన్ మాసంలో సాయం, దానం చేయడం ఎంతో పుణ్యం.
>
> 
>
> అబ్దుల్ కలాం(ముఫ్తీ, కనిగిరి)

చిరస్మరణీయుడు మాలకొండారెడ్డి


మాలకొండారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దద్దాల, ఇతర నేతలు


పెదమాలకొండయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దద్దాల

పీసీపల్లి: బద్దెల మాలకొండారెడ్డి చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ అన్నారు. మాలకొండారెడ్డి దిశ దిన కర్మలో గురువారం ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పామూరు మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్ రెడ్డి, సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేట, చెన్నపునాయునిపల్లె గ్రామాల్లో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకులు మృతిచెందగా గురువారం వారి దశదిన కర్మలకు వైఎస్సార్‌సీపీ కనగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు. డీజీపేటలో రేగలగడ్డ పెదమాలకొండయ్య నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. చెన్నపునాయునిపల్లెలో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి రమణయ్య దశదిన కర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మిరికెల గురవయ్య, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బి.వెంకటయ్య, జిల్లా అధికార ప్రతినిధి జి.ఆదినారాయణరెడ్డి, సైకం స్వర్ణ ఏడుకొండలు, మేకల బాలుయాదవ్, మేడబోయిన అటేలయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పామూరు: పామూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఇర్రి ట్రాక్టర్ కృష్ణారెడ్డి(40) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈ సందర్భంగా మృతుడు కృష్ణారెడ్డి నివాసానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి పలువురు నాయకులు మృతుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, యాట రాఘవేంద్ర, తుపాకుల అంజి, మాదిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, ఇర్రి వినోద్‌రెడ్డి, పిక్కిలి ప్రవీణ్ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి రైతులు సహకరించాలి

- రైతులందరికి పరిహారం అందేలా చూస్తాం
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళావతి

సీఎస్‌పురం(పామూరు): గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందేలా చూస్తామని రైతులు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సహకరించాలని గ్రీన్‌ఫీల్డ్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళావతి అన్నారు. మండలంలోని కొత్తపల్లి, దర్శి తిమ్మక్కపల్లె, గోగులపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న బెంగుళూరు, కడప, విజయవాడ (బీకేవి) రోడ్డు నిర్మాణ పనులను గురువారం తహసీల్దార్ డి.మంజునాథరెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో చర్చించారు. పలువురు తమకు పరిహారం రాలేదని ఆమె దృష్టికి తేగా త్వరితగతిన భూములు కోల్పోయే రైతుల వివరాలు, భూముల రికార్డుల వివరాలను పరిహారం పంపాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. జీరో ఖాతాలో ఉన్న భూములకు సంబంధించి పరిహారంపై కూడా త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.


తహసీల్దార్, రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళావతి

మెరుగైన వైద్య సేవలందించాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

కొండపి: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీల వైద్యులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాలు తగ్గించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా క్షేత్రస్థాయిలో ఆశావర్కర్లు కృషి చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, డీపీఓ వెంకట నాయుడు, తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీఓ రామాంజనేయులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా స్టెమీపై ఎంత మందికి అవగాహన ప్రశ్నించగా. ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉందని చెప్పడంతో మిగిలిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ మందిరంలో గడియారం లేకపోవడంపై వెంటనే ఏర్పాటు చేయాలని ఎంపీడీఓనుఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై నమ్మకం కలగాలి

కొండపి: అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వర్తించాలని సీడీపీఓ మాధవీలత అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషణ్ బీ పడాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న శిక్షణపై శ్రద్ధ చూపాలని సూచించారు. సూపర్‌వైజర్లు బి.సుచరితకుమారి, కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని తూర్పు నాయుడు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ బీ పడాయి బీ కార్యక్రమాన్ని మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మల్లేశ్వరి మూడు రోజుల పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లకు శిక్షణ ఇస్తామన్నారు. ఎంపీడీఓ దేవసేన కుమారి, ఎంఈఓ చెంచుపున్నయ్య, సర్పంచ్ రవికుమార్, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీఓ మాధవీలత

దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా చూడండి

కనిగిరిరూరల్: సదరన్ క్యాంప్‌లో దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని సదరన్ రీ వెరిఫికేషన్ క్యాంప్‌ను గురువారం ఆయన పరిశీలించారు. రీ వెరిఫికేషన్‌లో దివ్యాంగులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూడాలని వైద్యాధికారులను సూచించారు. మౌలిక వసతులు కల్పన చేయాలని ఆస్పత్రి సూపరిండెంట్ వెంకట సుబ్బయ్యను కోరారు.


సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

భగత్‌సింగ్ ఆశయ సాధనకు ముందుకు రావాలి

పామూరు: దేశంకోసం, భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత ముందుకు రావాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్.ఖాదర్‌బాషా అన్నారు. స్థానిక సుందరయ్య భవన్ సెంటర్‌లో గురువారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఖాదర్‌బాషా మాట్లాడుతూ భగత్‌సింగ్ చిన్న వయస్సులోనే దేశంకోసం ప్రాణత్యాగం చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. శంకర్, యాట వీరనారాయణ, స్టిక్కరింగ్ రఫీ, షేక్.గౌస్‌బాషా, మహబూబ్‌పీరా పాల్గొన్నారు.


యర్రంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివ ప్రసాద్‌రెడ్డి, దద్దాల , ఇతర నేతలు

చిరస్మరణీయుడు యర్రంరెడ్డి చెన్నారెడ్డి

కనిగిరిరూరల్: చిరస్మరణీయుడు యర్రంరెడ్డి చెన్నారెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక పవిత్ర కళ్యాణ మండపంలో హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి తండ్రి యర్రంరెడ్డి చెన్నారెడ్డి దశ దిన కర్మ గురువారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా పేద వర్గాల్లో విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయ నేతగా ఎన్నో సేవలందించారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, మున్సిపల్ చైర్మన్ గఫార్, జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, ఒకేరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, గంగసాని హుసేన్‌రెడ్డి, బొర్రారెడ్డి, కల్లూరి రామిరెడ్డి, పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, గురుప్రసాద్, తమ్మినేని సుజాత, ఎం నాగమణి, శ్రీహరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వి.రాజశేఖరరెడ్డి, పలుకూరి భాస్కర్, మాదాల వెంకట సుబ్బారావు, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, మహేంద్రారెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, డి వెంకట స్వామిరెడ్డి, గోడి నారాయణరెడ్డి, ముద్దా బాబు, సిగా కృష్ణారావు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు బుర్రా, అన్నా

యర్రంరెడ్డి చెన్నారెడ్డి చిత్రపటానికి స్థానిక పవిత్రా కళ్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, అన్నా రాంబాబు, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, కేవీ వెంకటేశ్వర్లు, న్యాయవాది రాజశేఖర్‌రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు వేర్వేరుగా పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా బాలనారాయణ

కనిగిరిరూరల్: న్యాయవాదుల బార్ అసోసియేషన్ కనిగిరి అధ్యక్షునిగా ఎరజాల బాలనారాయణ ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షునిగా ఎరజాల బాలనారాయణ, ఉపాధ్యక్షునిగా సయ్యద్ షాహీద్ మొహమ్మద్, కార్యదర్శిగా బుల్లా ప్రపుల్ల కుమార్, కోశాధికారులుగా ఎస్కే మీరావలి, ఎస్ మాలకొండారెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా నంబుల నాగరాజు, కంచర్ల శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ సీనియర్ న్యాయవాది చింతం గుంట్ల సాల్మన్‌రాజు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని సీనియర్ న్యాయవాదులు అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వై బాల నారాయణ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరి సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తానన్నారు.


న్యాయవాదుల బార్ అసోసియేషన్ నూతన కమిటీ

వేలాన్ని పరిశీలించిన వైస్ చైర్మన్

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, రీజనల్ మేనేజర్ ఎం లక్ష్మణరావు గురువారం సందర్శించి పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. వేలానికి చిర్రికూరపాడు గ్రామ రైతులు 285 పొగాకు బేళ్లు తీసుకురాగా అందులో 260 బేళ్లు కొనుగోలు చేశారు. సరాసరి ధర రూ.270.20గా నమోదైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా మండెల్లో మగ్గిన పొగాకునే బేళ్లు కట్టుకొని అమ్మకానికి తీసుకురావాలన్నారు. మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తీసుకురావాలని సూచించారు. వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో కనిష్ట ధర రూ.240 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. కామేపల్లి, అనకర్లపూడి గ్రామాలకు చెందిన రైతులు 429 బేళ్లను వేలానికి తీసుకురాగా 381 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 48 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.267.73గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, రీజనల్ మేనేజర్ ఎమ్. లక్ష్మణరావు

విధిగా ఆధార్ నమోదు చేయించుకోవాలి

పామూరు: ప్రతి ఒక్కరు విధిగా ఆధార్ నమోదు చేయించుకోవాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం బీసీ కాలనీలో గురువారం ఎంపీపీ, ఐసీడీఎస్ సూపర్ వైజర్, సర్పంచ్‌లు పర్యటించారు. ఈసందర్భంగా ఆధార్ నమోదుచేసుకోకపోవడంతో పథకాలకు దూరమవుతున్న సుమారు 7 మంది చిన్నారుల తల్లిదండ్రులను పిలిపించి ఆధార్ నమోదు విధానం దాని ప్రాముఖ్యత వివరించారు. 0 నుండి 6 సంవత్సరాలలోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరాలంటే విధిగా ఆధార్ కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ తెలిపారు. గ్రామంలోని సుమారు 5 మంది కిశోర బాలికలు పాఠశాలకు వెళ్లడం లేదని తెలపగా పిల్లలను వారి తల్లిదండ్రులు పాఠశాలకు పంపేలా కౌన్సెలింగ్ ఇచ్చారు.


ఆధార్ ఆవశ్యకతను వివరిస్తున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

భక్తిశ్రద్ధలతో షబే ఖద్ర్ వేడుకలు


ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఇఫ్తార్

- ప్రత్యేక ప్రార్థనలతో కిటకిటలాడిన మసీదులు

కనిగిరిరూరల్: రంజాన్ మాసంలో అతి ముఖ్యమైన రోజైన షబే ఖదర్ (జాగారం రాత్రి)ను ముస్లిం సోదరులు గురువారం రాత్రి అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. షబ్-ఏ-ఖద్ర్ (లైలతుల్ ఖద్ర్) సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మసీదుల్లో నూతన శోభ నెలకొంది. ముస్లిం సోదరులంతా మసీదులకు వెళ్లి అల్లాహ్ సన్నిధిలో నమాజు చేస్తూ, ఖురాన్ చదువుతూ రాత్రంతా గడిపారు. షబే ఖదర్ రాత్రి తరావీహ్, వాజిబుల్ వితర్, నఫిల్, నమాజ్‌లు చదువుతూ రాత్రంతా దైవ కృపలో నిమగ్నమయ్యారు. వెయి నెలల ప్రార్థనా పుణ్య ఫలాన్ని షబ్-ఏ -ఖదర్ ఒక్క రాత్రిలోనే పొందుతారు. ఈ సందర్భంగా మసీదుల్లో ఇమామ్‌లు, ముఫ్తీలు, మౌలానాలు బయాన్ చేశారు. అల్లాహ్ దీనుల కోసం దివ్య ఖురాన్‌ను భూలోకానికి పంపిన సందర్భంను, లైలతుల్ ఖద్ర ప్రాముఖ్యతను ఇమామ్‌లు వివరించారు. ప్రార్థనలు చేయడం, దివ్య ఖురాన్ గురించి తెలుసుకోవడం, చదవడం, ఎంతో పుణ్యకార్యం కావడంతో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక నమాజులతో పట్టణంలోని మసీదులన్నీ కిటకిటలాడాయి.

ముస్లిం యూత్ ప్రత్యేక ఇఫ్తార్..

రంజాన్ నెల ప్రారంభం నాటి నుంచి ముస్లిం యూత్‌ల ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయాన్నే సహరీ(ఉపవాసం ఆచరించే వారికి ఆహారం) ఏర్పాటు చేస్తున్నారు. షబ్ ఏ ఖదర్ (జాగారం రాత్రి) సందర్భంగా గురువారం రాత్రి ముస్లిం యూత్ కమిటి భారీ ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షదారులు మసీద్ వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ దావత్‌కు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అలాగే పలు మసీదుల్లోను ఇఫ్తార్ దావత్ జరిగింది. రంజాన్ నెల పురస్కరించుకుని ఇఫ్తార్, సహరీ దావత్‌ల ఏర్పాట్లతో ముస్లింలు నివసించే ప్రాంతాల్లో పండుగ శోభ నెలకొంది. సేవా, సహాయ కార్యక్రమాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.